సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం : 29 : జూలై : 2023



పడగ విప్పిన ప్రమాదం

వర్షాల రాకతో ఖరీఫ్ సాగు నేపథ్యంలో పాములు గడ్డిమాటున దాగి ఉండే అవకాశమున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. -8లో



ముగిసిన క్రీడా పోటీలు

రాజంపేట మండలపరిధిలోని నారనరాజు పల్లిలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
34.2/26.5

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 26.5 - 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 9.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఆగస్టు నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని కార్డుదారులకు ఆగస్టు నెల నుంచి ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఉచితంగా అందజేస్తామని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ బియ్యం కంటే ఇందులో ఐరన్, విటమిన్ బి-12, ఫోలిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటాయన్నారు. బలవర్థకమైన ఈ బియ్యాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ బియ్యం చిన్న పిల్లలు, గర్భిణీలలో పోషక విలువలు పెంపొందింపజేస్తుందన్నారు. కాగా, బియ్యానికి బదులు మూడు కిలోల రాగులు ప్రతి కార్డుదారు ఉచితంగా తీసుకోవచ్చన్నారు. చక్కెర అరకిలో రూ.17, అర్బన్ ఏరియాలో గోధుమపిండి కిలో రూ.16 చొప్పున ఒక కార్డుకు కిలో చొప్పున అందజేస్తామన్నారు.

రూ.10 కోట్లు మంజూరు

వేంపల్లె : వేంపల్లె పట్టణంలోని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10కోట్ల నిధులు మంజూరు చేసిందని వేంపల్లె జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో ఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటైందని, అందుకు సంబంధించి నూతన భవన నిర్మాణానికి దాదాపు రూ.22కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ నేపథ్యంలో కళాశాలలో ఆడిటోరియం ఏర్పాటు, అప్రోచ్ రోడ్డు కోసం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే నిధులు మంజూరు చేయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే వీటి నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ ఫెయిర్‌కు విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థుల నుంచి చక్కటి స్పందన లభించింది. ఈ మేళాను వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ ప్రారంభించారు. చదువుకునే సమయంలోనే ఉద్యోగ, ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని యువతకు సూచించారు. కళాశాల కరస్పాండెంట్, వైవీయూ పాలకమండలి సభ్యుడు జి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని మేళాలు నిర్వహిస్తామని తెలిపారు. జాబ్ మేళా సమన్వయకర్త కిరణ్‌కుమార్ మార్కెట్‌లో లభించే ఉద్యోగాలు, వాటిని సాధించేందుకు కావల్సిన నైపుణ్యాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు రెండురౌండ్ల ఇంటర్వ్యూలు, గ్రూప్ డిస్కషన్ నిర్వహించి పలు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కాగా, జాబ్‌మేళాలో ఉద్యోగాలు సాధించిన 450 మంది విద్యార్థులకు మేయర్ సురేష్‌బాబు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైవీయూ పాలకమండలి సభ్యుడు హరినారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ కె. నరసింహారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వర్షించిన ఆశలు

- మొదలైన ఖరీఫ్ సందడి
- ఆలమట్టి నుంచి శ్రీశైలం డ్యాం లోకి చేరుతున్న వరదనీరు
- కేసీ, బోర్ల కింద నాడుమడుల సాగుకు సిద్ధమవుతున్న రైతులు



● దువ్వూరు ప్రాంతంలో సాగుచేసిన నారుమడి

కడప అగ్రికల్చర్: మొన్నటి వరకు ఖరీఫ్ సీజన్‌లో పంటలసాగుపై ఎన్నో సందేహాలు ఉండేవి. సీజన్ ప్రారంభమై 57 రోజులు గడిచినా ఒక్కసారి కూడా సరైన వాన పడకపోవడంతో రైతులు వరి, వేరుశనగ, పత్తి వంటి పంటల సాగుపై ఆశలు వదులుకున్నారు. జిల్లా వ్యవసాయాధికారులు కూడా ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళికలను సిద్ధం చేసి విత్తనాల కోసం ప్రభుత్వానికి నివేదికలు కూడా పంపారు.జులై చివరి వారం, ఆగస్టు 15వ తేదీ వరకు వర్షాలు పడికపోతే ఏ మేరకు విత్తనాలు కావాలనే నివేదికలను తయారు చేసి రాష్ట్రస్థాయి అధికారులకు పంపారు. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మూడు రోజుల నుంచి జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండంతో మళ్లీ సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి 25వ తేదీన జిల్లాలో 288.2 మిల్లీమీటర్లు 26న 456 మి.మీ, 27వ తేదీన 556.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీనికితోడు పై భాగంలో కురుస్తున్న వర్షాలకు ఆలమట్టి డ్యాం నుంచి శ్రీశైలం డ్యాంకు వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో కేసీ రైతుల్లో ఆనందం వెల్లి విరుస్తోంది. ఇప్పటికే జిల్లాలో నదీ పరివాహక ప్రాంతంతోపాటు కేసీ కెనాల్, బోర్ల కింద రైతులు వరికి సంబంధించి నారుమడుల సాగుకు సన్నద్ధమవుతుండగా కొంతమంది ఏకంగా నారుమడులను సాగు చేశారు. మెట్ట ప్రాంతాల్లో ఆరుతడి పంటలైన మినుము, జొన్న, మొక్కజొన్న, కొర్ర వంటి పంటలను కూడా సాగు చేయనున్నారు.

విత్తనాల పంపిణీ పూర్తి

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులకు అవసరమైన పచ్చిరొట్ట, వేరుశనగ విత్తనాలను వ్యవసాయ అధికారులు పంపిణీ చేశారు. ఇందులో పచ్చిరొట్ట విత్తనాలు జిల్లాకు 5613 క్వింటాళ్లు కేటాయించగా ఇందులో 5094.5 క్వింటాళ్లు పంపిణీ చేశారు. వేరుశనగ కాయలు జిల్లాకు 5730 క్వింటాళ్లు మంజూరు చేయగా ఇందులో 5186 క్వింటాళ్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షంతో చాలా మంది రైతులు వేరుశనగ, పచ్చిరొట్ల విత్తనాలను సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు శ్రీశైలం డ్యాంకు చేరుతోంది. దీంతో కేసీ కెనాల్ రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.కాడి, మేడీ సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించి 77,128 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం ఉండగా.. నీటి ఆధారం ఉన్న ప్రాంతాల్లో ఇప్పటివరకు 10159 హెక్టార్లలో వరిపంట, మొక్కజొన్న, సజ్జ, కంది, మినుములు, వేరుశనగ, సోయాబీన్, పత్తి, పసుపు, మిరప వంటి పంటలను సాగు చేశారు. వర్షం రాకతో చాలా మంది రైతులు వేరుశనగ, పత్తి, జొన్న, మొక్కజొన్న, కొర్ర వంటి పంటలు సాగు చేయనున్నారు.

పుష్కలంగా ఎరువులు..

జిల్లాలో ప్రస్తుతం ప్రైవేటు డీలర్లు, రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్‌బీకే) 20,516. 65 మెట్రిక్ టన్నులు ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. ఇందులో ఆర్‌బీకేల్లో 848.55 మెట్రిక్ టన్నుల డీఏపీ, 989.85 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 1232.86 మెట్రిక్ టన్నుల యూరియా, 536.65 మెట్రిక్ టన్నుల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ సిద్ధంగా ఉంది.ప్రైవేటు డీలర్లు వద్ద 2373.15 మెట్రిక్ టన్నుల డీఏపీ, 5848.75 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 5982.12 మెట్రిక్ టన్నుల యూరియా, 1334.72 మెట్రిక్ టన్నుల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 1375 మెట్రిక్ టన్నుల సింగిల్ సూపర్ ఫాస్పేట్ అందుబాటులో ఉంది. ఇలా అన్ని రకాల ఎరువులు కలుపుకని 20,516.65 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి.



ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం : 77,128 హెక్టార్లు

సాగైన పంటలు : 10,159 హెక్టార్లు



అందుబాటులో ఉన్న ఎరువులు: 20516.65 టన్నులు



జిల్లాకు కేటాయించిన పచ్చిరొట్ట విత్తనాలు: 5613 టన్నులు

ఇప్పటి వరకు పంపిణీ చేసినవి: 5094.5 టన్నులు



జిల్లాకు కేటాయించిన వేరుశనగ కాయలు: 5730 టన్నులు

పంపిణీ జరిగినవి: 5186.8 టన్నులు

రైతులకు ఎంతో మేలు...



ఇప్పుడు కురిసిన వాన రైతులకు ఎంతో మేలు. ప్రస్తుతం జిల్లాలో 10 వేలకు పైగా హెక్టార్లలో వరి, మొక్కజొన్న, సజ్జ, కంది, మినుములు, వేరుశనగ, సోయాబీన్, పత్తి, పసుపు, మిరప సాగు చేశారు. ఈ వర్షంతో పంటలకు చీడపీడలు కూడా దూరమవుతాయి.కేసీ, బోరుబావుల కింద నారుమడులను సాగు చేయనున్నారు. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు పుష్కలంగా ఉన్నాయి.అన్నదాతలుదేనికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి

అంతరాయాల పర్యవేక్షణకు
కాల్ సెంటర్లు

ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



మాట్లాడుతున్న ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) సీఎండీ సంతోష రావు సూచించారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో ఎదురయ్యే అంతరాయాలను పర్యవేక్షించడానికి సర్కిల్ కేంద్రాల్లోని సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్/టెక్నికల్ నియంత్రణలో ఈ పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే ఉన్న టోల్ ఫ్రీ నెంబరు 1912 కు అదనంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు సంబంధించిన అన్ని పనులు పూర్తయ్యే వరకు 24 గంటలు పర్యవేక్షణా కేంద్రాలు పని చేస్తాయని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, స్తంభాలు/నియంత్రికలు దెబ్బతినడంతో పాటు ఇతర విద్యుత్ సరఫరా సంబంధిత సమస్యలను పరిష్కరించుకునేందుకు ఆయా సర్కిల్ పరిధిలో ఈ క్రింది నంబర్లను సంప్రదించవలసిందిగా వినియోగదారులకు సూచించారు.

నెల్లూరు:	94408 17468
తిరుపతి:	9440817412
కడప:	94408 17440
అనంతపూర్:	94910 67446
కర్నూలు:	73826 14308

మానవజాతికి సిగ్గుచేటు

● మణిపూర్ ఘటనపై వెల్లువెత్తిన నిరసన ● కడపలో సర్వమతస్తుల ర్యాలీ



ర్యాలీగా వస్తున్న సర్వమతస్తులు



కార్యక్రమంలో పాల్గొన్న నగర వాసులు

కడప కల్చరల్: మణిపూర్ మారణకాండ సర్వమానవాళి సిగ్గుపడాల్సిన అంశమని కడప నగర మేయర్ సురేష్‌బాబు అన్నారు. మణిపూర్‌లో చోటుచేసుకున్న అశాంతి, మహిళల పట్ల తీరును నిరసిస్తూ శుక్రవారం కడప నగరం ఏడురోడ్ల కూడలిలో అన్ని మతాలకు చెందిన ప్రతినిధులు, సభ్యులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ మణిపూర్‌లో చోటుచేసుకున్న దుస్సంఘటనలు మరెక్కడా జరగకూడదని, ఇవి మానవ జాతి మొత్తం సిగ్గుతో తలదించుకోవాల్సిన అంశమన్నారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం శాంతినే కాంక్షిస్తున్నదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇలాంటి ఘటనలను తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. మహిళలకు రక్షణ లభించినపుడే సమాజం శాంతియుతంగా ఉంటుందని, ఇలాంటి అరాచకాలు మానవత్వానికి మాయని మచ్చగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌బీ అహ్మద్‌బాష మాట్లాడుతూ ఏ మతమైనా శాంతినే కోరుతుందని, మతంకంటే మానవత్వమే గొప్పదని అన్నారు. మణిపూర్ లాంటి సంఘటనలు మరెక్కడా జరగకుండా అన్ని మతాల ప్రజలు ఐక్యంగా కృషి చేయాలని, సమాజంలో అశాంతి రేగితే అన్ని మతాల ప్రజలకు నష్టమే వాటిల్లుతుందని నగరానికి చెందిన అన్ని పార్టీలు, అన్నిమత సంఘాల ప్రతినిధులు, సభ్యులు అన్నారు. అర్చక పురోహిత ప్రముఖులు విజయ్‌భట్టర్ ఈ సందర్భంగా శాంతిమంత్రం పఠించి దేశంలో శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు.

భారీ ర్యాలీ

మణిపూర్‌లో అశాంతి, అరాచక సంఘటనలను నిరసిస్తూ జరిగిన ఈ కార్యక్రమానికి నగరానికి చెందిన అన్నిమతాల ప్రముఖులు, సంఘాల సభ్యులు హాజరయ్యారు. వారి వారి ప్రార్థనా స్థలాల నుంచి బయలుదేరి మణిపూర్ సంఘటన మానవజాతికి సిగ్గుచేటు అంటూ ప్ల కార్డులు చేతబట్టి ర్యాలీగా సాగారు. అందరూ ఏడురోడ్ల కూడలి వద్దకు చేరుకుని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, అఫ్జల్‌ఖాన్, సుభాన్‌బాష, డాక్టర్ సొహైల్, టీడీపీ నాయకులు అమీర్‌బాబు, శ్రీనివాసులురెడ్డి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా రక్షణచర్యలు

వర్షాకాలంపై సమీక్షలో కలెక్టర్ విజయరామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : వర్షాకాలంలో రానున్న భారీ వర్షాలు, తుఫాన్లను ప్రణాళికాబద్ధంగా ఎదుర్కోవాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులకు సూచించారు. వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు, ఏర్పాట్లు, సన్నద్ధతపై శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎలాంటి పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. సచివాలయ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వలంటీర్లు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో 24 గంటలు ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలన్నారు. కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలను అప్రమత్తం చేయడంలో..తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బందిని తుఫాను సహాయక చర్యలకు సిద్ధం చేయాలన్నారు.

రహదారుల భద్రత.. సామాజిక బాధ్యత

జిల్లాలో రహదారుల భద్రత ద్వారా ప్రజల ప్రాణాలు కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకు అవకాశాలు ఎక్కువగా ఉన్న మలుపుల వద్ద బారికేడ్లు, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలను ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పెట్రోలు బంకు, కమర్షియల్ కాంప్లెక్స్ వద్ద సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. బ్లాక్ స్పాట్ గుర్తించడం, లాంగ్ గ్రైవ్‌లో వచ్చే డ్రైవర్లకు అక్కడక్కడ రెస్ట్ రూములు ఏర్పాటు చేయాలన్నారు.

నా మట్టి.. నా దేశం

మేరీ మిట్టి-మేరా దేశ్ నినాదంతో భారత ప్రభుత్వం ఈ ఏడాది నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు జిల్లా స్థాయిలో విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.భారత ప్రభుత్వం ఆగస్టు 9 నుంచి 20వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. ఆగస్టు 9 నుంచి 15వ తేదీ వరకు గ్రామీణ ప్రాంతాల్లో, 16 నుంచి 20వ తేదీ వరకు పట్టణ ప్రాంతాల్లో అమృతోత్సవ ర్యాలీలు నిర్వహించాలన్నారు. దేశం కోసం అత్యున్నత త్యాగాలు చేసిన వీరులకు నివాళులు అర్పించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో జేసీ గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో గంగాధర్ గౌడ్, డీటీసీ మీరా ప్రసాద్, ఆర్టీఓలు, వైద్యాధికారులు, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

▶▶ ఆడుదాం.. ఆంధ్ర

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను శుక్రవారం ఆదేశించారు. 17 ఏళ్లు పైబడిన వారిని క్రీడల్లో భాగస్వామ్యం చేయాలన్నారు. పురుషులు, మహిళల కోసం బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను నిర్వహించాలన్నారు. 3కే మారథాన్, యోగా, టెన్నికాయిట్, స్థానిక సంప్రదాయ ఆటలను నిర్వహించాలన్నారు. ఆధార్ లేదా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఒక ఐడీ ప్రూఫ్ సమర్పించి పోటీలకు పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. నాకౌట్ ప్రాతిపదికన ఒక క్రీడాకారుడు గరిష్ఠంగా రెండు విభాగాల్లో మాత్రమే పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

కుప్పం.. శరవేగం

- చకచకాల సాగుతున్న కేజీసీ పనులు
- టీడీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యం
- ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యం
- భూసేకరణ, పనులకు రూ.100 కోట్లు మంజూరు

బి.కొత్తకోట: మాజీ సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరుజిల్లా కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలను వచ్చే అక్టోబర్‌లో తరలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఏపీఆర్ హంద్రీ-నీవా ప్రాజెక్టు రెండో దశలో అంతర్భాగంగా చేపట్టిన కుప్పం ఉప కాలువ పనుల (కేబీసీ)ను గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి వదిలేసింది. దీంతో ప్రస్తుత ప్రభుత్వం కుప్పంకు కృష్ణా జలాలను తరలించాలన్న ఆశయంతో ఉంది. ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో పనులన్నీ పూర్తయ్యాక శ్రీసత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను తరలించి ట్రయల్‌రన్ నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. పనులు సత్వరమే పూర్తి చేసేలా మిగిలిన భూసేకరణకు ఈనెల 23న రూ.40 కోట్లు, పనులకు రూ.60 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.430.27కోట్లతో చేపట్టిన కుప్పం ఉపకాలువ చిత్తూరుజిల్లా పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణీ మండలం అప్పినపల్లె చెరువు వద్ద ప్రారంభమై కుప్పం నియోజకవర్గంలోని పరమసముద్రం చెరువులో కలుస్తుంది. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని వీ.కోట, రామకుప్పం, శాంతిపురం, గుడిపల్లె, కుప్పం, గంగవరం, పెద్దపంజాణీ, బైరెడ్డిపల్లె మండలాల్లో 6,300 ఎకరాలకు ఆయకట్టు, 4.02లక్షల మంది జనా భాకు తాగునీరు అందించి, 110 చెరువులకు కృష్ణా జలాలను అందించాలన్నది ప్రణాళిక. దీనికి 1.10 టీఎంసీల నీటిని తరలించాలని ప్రతిపాదించారు. 143 కిలోమీటర్ల కాలువ పనులు, 3 ఎత్తిపోతల పథకాల నిర్మాణం, 285 కల్వర్టులు, బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలి. అయితే గత టీడీపీ పాలనలో ఉపకాలువ పనులను పూర్తి చేయించే విషయంలో మాజీ సీఎం చంద్రబాబు నిర్లక్ష్యంతో కాంట్రాక్టు సంస్థ పనులు నిలిపివేయగా పట్టించుకోలేదు.



కుప్పం కాలువ టన్నల్ పనులు



గుడిపల్లె మండలం ఒంటపల్లె వద్ద సాగుతున్న కాలువ పనులు

ప్రస్తుతం.. పనులు చకా చకా

ప్రస్తుత ప్రభుత్వం కుప్పంకు కృష్ణా జలాలను తరలించాలన్న కృతనిశ్చయంతో అసంపూర్తి పనులను చేపట్టి పూర్తి చేయించే దిశగా అడుగులు వేస్తోంది. కుప్పం ఉపకాలువ పనులను ప్రభుత్వం చకా చకా చేయిస్తోంది. గత టీడీపీ హయాంలో ఆగిపోయిన అసంపూర్తి పనులను ప్రభుత్వం గత కాంట్రాక్టు సంస్థ ఒప్పందం మేరకే ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థకు అప్పగించి అదనంగా భారం పడకుండా చేసింది. రూ.62.98 కోట్ల విలువైన సివిల్ పనులు ఆగిపోగా వాటిని రూ.63.31 కోట్లకు, రూ.33.89 కోట్ల విలువైన మెకానికల్ పనులను రూ.36.09 కోట్లకు అప్పగించారు. ఈ పనులు చేపట్టిన ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులు వేగవంతం చేసింది. రూ.37.11 కోట్ల సివిల్ పనులు, రూ.8.36 కోట్ల మెకానికల్ పనులు పూర్తయ్యాయి. రూ.27.20 కోట్ల సివిల్ పనులు, రూ.27.73 కోట్ల మెకానికల్ పనులు జరుగుతున్నాయి. 4.8 కిలోమీటర్ల అసంపూర్తి కాలువ పనిలో 4.22 కిలోమీటర్ల కాలువ పూర్తయ్యింది. 112 పెండింగ్ స్ట్రక్చర్స్ నిర్మాణాల్లో 38 పూర్తి చేయగా, 49 నిర్మాణాలు సాగుతుండగా, 25 పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనులను సెప్టెంబర్‌లోగా పూర్తి చేయించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

అక్టోబర్‌లో నీళ్లిస్తాం

కుప్పం నియోజకవర్గానికి అక్టోబర్ రెండోవారంలో కృష్ణా జలాలు ఇవ్వాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనికి అనుగుణంగా పనుల్లో వేగం పెంచాం. రెండునెలల్లో మిగులు పనులు పూర్తి చేయించి నీళ్లు పారిస్తాం. ఎత్తిపోతల పథకలను సిద్ధం చేస్తున్నాం. సాంకేతిక సమస్యలను గుర్తించి సరిచేస్తున్నాం. -సీఆర్.రాజగోపాల్, ఎస్ఈ, మదనపల్లె

చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి..

శ్రీసత్యసాయిజిల్లా కదిరి సమీపంలో చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి ప్రారంభమయ్యే హంద్రీ-నీవా ప్రాజెక్టు రెండో దశలోని పుంగనూరు ఉపకాలువ అన్నమయ్యజిల్లాలోని తంబళ్లపల్లె నియోజకవర్గం మీదుగా మదనపల్లె, చిత్తూరుజిల్లాలోని పుంగనూరు నియోజకవర్గం మీదుగా పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణీ మండలంలోని అప్పినపల్లె వరకు సాగుతుంది. ఇక్కడి నుంచే కుప్పం ఉపకాలువ ప్రారంభమై..కుప్పం నియోజకవర్గంలోని పరమసముద్రం చెరువులో కలిసి ముగుస్తుంది. కుప్పం కాలువ పూర్తయ్యాక చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను తరలించేందుకు ప్రాజెక్టు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకొంటున్నారు. అక్టోబర్ రెండో వారంలో ఎట్టి పరిస్థితుల్లో ట్రయల్‌రన్ పూర్తి చేసి కుప్పంకు కృష్ణా జలాలు తరలించాలని చర్యలు చేపట్టారు. రెండురోజుల క్రితం జలవనరులశాఖ ఉన్నతస్థాయి అధికారులు నిర్వహించిన సమీక్షలోనూ సత్వరమే కుప్పం కాలువ పనులు పూర్తిచేసి నీళ్లు ఇవ్వాలని నిర్ణయించారు.

క్లుప్తంగా

త్యాగానికి ప్రతీక మొహర్రం


పీర్లచావిడి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్‌ దేవనాథరెడ్డి

చిన్నమండెం : త్యాగానికి, మంచితనానికి ప్రతీకగా మొహర్రం వేడుకలు నిలుస్తాయని జెడ్పీ మాజీ వైస్‌ చైర్మన్‌ దేవనాథరెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నమండెం పీర్లచావిడిలో మొహర్రం సందర్భంగా దేవనాథరెడ్డి కడప పెద్దదర్గా పీఠాధిపతి హజరత్‌ ఆరీఫుల్లాహుసేనితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురువు హజరత్‌ ఆరీఫుల్లాహుస్సేని ఆశీర్వదించి, సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఏజాస్‌ఆలీఖాన్‌ తండ్రి సవాద్‌ ఆలీఖాన్‌ పీర్లకు బాసికం అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వృద్ధురాలి దారుణ హత్య


రాధమ్మ (ఫైల్‌)

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఆజాద్‌నగర్‌లో ఓ వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. ఎస్‌ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆజాద్‌ నగర్‌కు చెందిన రాధమ్మ (57) తన ఇంట్లో ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు తలపైకొట్టి హత్య చేసినట్లు తెలిపారు. ఈమె అద్దె ఇంట్లో నివాసం ఉందని, పలువురు వ్యక్తులకు ఫైనాన్స్‌ ఇస్తూ జీవనం సాగించేదని తెలిసిందన్నారు. ఆమె ఒక్కరే ఇంట్లో జీవనం సాగిస్తుండగా గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి హత్య చేసినట్లు తెలిపారు. హత్య జరిగిన విషయాన్ని స్థానికులు సమాచారం అందించగా రూరల్‌ సీఐ అశోక్‌రెడ్డి, సికెదిన్నె ఎస్‌ఐ అరుణ్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కడప అర్బన్‌ : కడప నగరంలోని 'దిశ' పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్‌ కోసం వచ్చిన ఓ మహిళ (30) ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. వెంటనే స్పందించిన పోలీసులు ఆమెను 108లో రిమ్స్‌కు తరలించారు. చిన్నచౌక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో అశోక్‌నగర్‌లో నివాసం వుంటున్న ఓ మహిళకు ఇద్దరు పిల్లలు. కొన్ని సంవత్సరాల క్రితం భర్త మృతి చెందాడు. తరువాత చెన్నూరుకు చెందిన ఓ యువకుడితో వివాహేతర సంబంధం పెట్టుకుని సహజీవనం చేశారు. ఇటీవలి కాలంలో తనను దూరంగా పెట్టాడని, తనకు సదరు యువకునితో వివాహం చేయించి, న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించింది. ఈక్రమంలో కడప 'దిశ' పోలీస్‌స్టేషన్‌కు మహిళను, ఆ యువకుడిని పిలిపించారు. కౌన్సెలింగ్‌ బృందం వారు వారికి కౌన్సెలింగ్‌ నిర్వహించారు. వీరి మధ్య మనస్పర్థలు తొలగించేందుకు కౌన్సెలింగ్‌ నిర్వహించాలని వచ్చే నెల 11న తేదీని నిర్ణయించారు. తరువాత ఆమె బాత్‌రూంకనీ వెళ్లి తన వెంట తెచ్చుకున్న క్రిమి సంహారణ ద్రావణాన్ని సేవించింది. బయటకు రాగానే ఆమెను గుర్తించి పోలీసులు వెంటనే 108లో రిమ్స్‌కు పంపించారు.

పడగ విప్పిన ప్రమాదం

• వీరి ఇద్దరి పిల్లలనూ..



వీరి పేర్లు రామాంజనేయులు, అనురాధ. వీరిది సింహాద్రిపురం మండలం అంకాలమ్మగూడూరు గ్రామం. రామాంజనేయులు తొండూరు పోలీస్‌ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. వీరికి ముగ్గురు సంతానం. నవదీప్‌(6), భవ్యశ్రీ(4), రెండు నెలల బాబు (ఇంకా పేరు పెట్టలేదు) ఉన్నారు. ఈ నెల 24న రాత్రి సమయంలో వారి ఇంట్లోకి పాము దూరి నిద్రపోతున్న నవదీప్‌, భవ్యశ్రీని కాటేసింది. ఈ ప్రమాదంలో వారిద్దరూ చనిపోయారు. దీంతో వారి తల్లిదండ్రులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. విధి ఇంత చిన్నచూపు చూస్తుందని అనుకోలేదని, ఇలా ఎవరికీ జరగకూడదని వారు అంటున్నారు.

• గడ్డి మాటున ఉండి..



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు ముక్కమల్ల రవిశంకర్‌రెడ్డి (60). ఈయనది వైఎస్‌ఆర్‌ జిల్లా రాజుపాళెం మండలం టంగుటూరు గ్రామం. ఈ ఏడాది జనవరి 19న పశువులను మేపేందుకు పొలాల్లోకి వెళ్లాడు. గడ్డిలో ఉన్న పాము కాటు వేయడంతో గట్టిగా కేకలు వేశాడు. చుట్టుపక్కల వారు వచ్చి ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. ఆయనకు భార్య అరుణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

• పొలంలో వెళ్తుండగా..



అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె పంచాయతీ బుచ్చిరెడ్డిగారిపల్లెకు చెందిన చిన్నప్ప కుమారుడు శ్రీనివాసులు(42) వ్యవసాయ పనులతోపాటు వంట మాస్టర్‌గా పని చేసే వాడు. గ్రామ సమీపంలోని నేలమల్లేశ్వరస్వామి ఆలయ మార్గంలో పొలం వద్ద ఇల్లు కట్టుకుని పనులు చేసుకుంటూ అక్కడే నివసిస్తున్నాడు. ఈ ఏడాది జూలై 15వ తేదీ సాయంత్రం పొలంలో కోసిన టమాటాలను తీసుకువచ్చేందుకు వెళుతుండగా పాము కాలుపై కాటేసింది. తీవ్ర అస్వస్థతకు గురై అతికష్టం మీద ఇంటికి చేరుకుని జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే వారు 108 అంబులెన్స్‌ సాయంతో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ మెరుగైన చికిత్సలు అందించినప్పటికీ అప్పటికే విషం శరీరం మొత్తం పాకడంతో పరిస్థితి విషమించి మృతి చెందాడు.



- వర్షా కాలం... విష పురుగుల సంచారం అధికం
- పంట పొలాలు, ఇంటి పరిసరాల్లో పొంచి ఉన్న ప్రమాదం
- పాము కాటుకు బలైపోతున్న రైతులు, చిన్నారులు
- సింహాద్రిపురం మండలంలో అన్నాచెల్లెళ్లు మృతి
- అప్రమత్తత అవసరం

వర్షా కాలం ప్రారంభమైంది. వైఎస్‌ఆర్‌, అన్నమయ్య జిల్లాల్లో జోరుగా వానలు కురుస్తున్నాయి. ఇప్పటి వరకు భూమిలో ఉన్న వేడి.. ఆవిరి రూపంలో బయటకు వస్తోంది. ఈ క్రమంలో భూమి పొరల్లో ఉండే విష పురుగులు బయటికొస్తున్నాయి. పొలాల్లోనే కాదు.. ఖాళీ మైదానాల్లోనూ.. ఎక్కడో ఓ చోట.. పూటకొకటి బుసలు కొడుతున్నాయ్‌. చెట్లు, పుట్టల మాటు నుంచి ఏకంగా గుమ్మం దాటి ఇళ్లల్లోకి చొరబడి కాటేస్తున్నాయి. తాజాగా జిల్లాలోని సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరులో ఇంట్లో నిద్రపోతున్న చిన్నారులైన అన్నాచెల్లెళ్లను పాము కాటు వేసింది. వారు మృత్యువుతో పోరాడి ప్రాణాలు కోల్పోయారు. ఇలా ఎందరో అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు.

కడప డెస్క్‌ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఉమ్మడి జిల్లాల్లో వర్షాలు కురవడం ప్రారంభమయ్యాయి. దీంతోపాటు ఖరీఫ్‌ సీజన్‌ కూడా ఆరంభమైంది. ఇక రైతన్నలు పొలం బాట పట్టనున్నారు. దీంతో వారు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా వర్షాల రాకతో పంట పొలాలు, బీడు భూముల్లో పచ్చిక బాగా పెరుగుతుంది. దీంతో విష పురుగులైన పాములు, తేళ్లు గడ్డిమాటున దాగి ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఆదమరిచి ఉన్న వారిని ఇవి కాటేస్తున్నాయి. ఈ కారణంగా ఉమ్మడి జిల్లాల్లో పాము కాటుకు గురై ఆసుపత్రులకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే రైతులు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వర్షాలు కురుస్తున్న కారణంగా ఇంటి పరిసరాల్లోని ఖాళీ స్థలాల్లో పొదలు పెరగడం వల్ల విషపురుగుల సంచారం అధికమైంది. ఒక్కోసారి అవి ఇళ్లలోకి రావడంతో పాము కాటు బాధితుల సంఖ్య ఎక్కువ అవుతోంది.

పాము కరిస్తే లక్షణాలు
- పాము కాటు వేసిన ప్రదేశంలో కోరల గాయం స్పష్టంగా కనిపించి నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షపాతం కారణంగా నాలుక మందమైనట్టు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లుగా గొంతులో ఏదీ దిగని పరిస్థితి తలెత్తవచ్చు.
- కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.

కడప రిమ్స్‌కు 2022లో 257 పాము కాటు కేసులు వచ్చాయి. వీటిలో రెండు మరణాలు సంభవించాయి. 2023లో ఇప్పటి వరకు 141 కేసులు వచ్చాయి. వీటిలో ఒక మరణం సంభవించింది.

అన్ని పాములు ప్రమాదకరం కాదు..
మన ప్రాంతాల్లో ఉండే పాముల్లో కట్లపాము, నాగుపాము, రక్తపింజరలే ప్రమాదకరమైన సర్పజాతి. వీటితోనే ఎక్కువ ప్రమాదం ఉంటుంది. సాధారణంగా కొన్ని పాముల్లో విషం ప్రభావం తక్కువగా ఉండటంతోపాటు అది కరిస్తే కేవలం గాయం మాత్రమే అవుతుంది. సాధారణ వైద్యంతో నయవుతుంది. పాము కాటు వేసిన చోట గుడ్డ లేదా తాడుతో కట్టు కట్టాలి, వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. పాము కాటుకు గురైన వ్యక్తులు ఆందోళన చెందకుండా చూసుకోవాలి. ఆందోళన చెందితే గుండెపోటుకు గురయ్యే అవకాశాలుంటాయని వైద్యులు చెబుతున్నారు. ధైర్యంగా ఉంటే ప్రాణాలు రక్షించుకోవచ్చని సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి
- రైతన్నలు పొలాల గట్టు మీద వెళ్తున్న సమయంలో కర్రచప్పుడు చేస్తూ నడవడం మంచిది.
- రాత్రి పూట టార్చిలైట్‌ తీసుకెళ్లాలి.
- కాళ్లకు చెప్పులకు బదులు బూట్లు ధరించాలి.
- పొలాల గట్ల వెంట పొదలు లేకుండా చూసుకోవాలి. ఒక వేళ ఉంటే వర్షాకాలంలో అటు వైపు వెళ్లకపోవడం మంచిది.
- ధాన్యపు బస్తాలు నిల్వ ఉండే చోట ఎలుకలు తిరుగుతూ ఉంటాయి. గడ్డివాములు ఉండే ప్రాంతంలో కూడా ఎలుకలు, కప్పలు తిరుగుతూ ఉంటాయి. వాటిని తినడానికి పాములు అక్కడికి చేరి చెత్తమాటున దాక్కొని ఉంటాయి. కావున గడ్డి వామి దగ్గరకు చప్పుడు చేస్తూ వెళ్లాలి. గడ్డివాముల చుట్టూ శుభ్రంగా ఉంచుకోవాలి. ఇలా చేస్తే విషపురుగుల బెడద తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది.
- ప్రథమ చికిత్స పెట్టి, అత్యవసర మందులు వెంట తీసుకెళ్తే మంచిది.
- సాధ్యమైనంత వరకు ఒంటరిగా కాక తోడుగా వెళ్లడం అలవాటు చేసుకోవాలి.

వైఎస్‌ఆర్‌ జిల్లాలో పాము కాటుకు సంబంధించిన కేసులు



సంవత్సరం	కేసులు
2020	1
2021	20
2022	21
2023 (ఇప్పటి వరకు)	10
మొత్తం	52

వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసుకెళ్లాలి



పాము కాటుకు గురైన వ్యక్తులకు నాటు మందులు, ఆకు పసురు వంటి వాటిని వేయకూడదు. తక్షణం దగ్గరలోని ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. ముందుగా పాము కాటుకు గురైన వ్యక్తికి రక్తం గడ్డకట్టే విషం ఎక్కిందా, లేక నరాలు బిగుసుకునే విషం ఎక్కిందా అనేది గుర్తించి చికిత్సను ప్రారంభించాలి. అలా చేస్తే ప్రమాదం ఉండదు. ఏది ఏమైనా వీలైనంత త్వరగా చికిత్సను ప్రారంభిస్తే ప్రాణాపాయం అంతగా ఉండదు.
– డాక్టర్‌ కోటకొండ మనోహర్‌, వైద్య నిపుణులు, రిమ్స్‌

అందుబాటులో మందులు



ప్రస్తుత సీజన్‌లో కొద్దిపాటి నీటి ప్రవాహానికి కూడా పాములు, తేళ్లు కొట్టుకుని వస్తాయి. అలాంటి సందర్భాల్లో పాములు ఇళ్లలోకి లేదా బయట పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ ఉంటాయి. పొరపాటున పాముకాటుకు గురైతే తక్షణమే వైద్యులను సంప్రదించాలి. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్లు, కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పాముకాటుకు సంబంధించి యాంటీ స్నేక్‌ వీనమ్‌ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే తేలు కాటుకు కూడా మందులు సిద్ధంగా ఉన్నాయి. ఉచితంగా వైద్య సేవలను పొందవచ్చు. పిల్లలు రాళ్లు, పొదలు, అపరిశుభ్రత ప్రాంతాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
– డాక్టర్‌ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం


హోంగార్డు రామాంజనేయులు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి

సింహాద్రిపురం : 'ఇది విధిరాత అధైర్యపడొద్దని' బాధితులను కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి ఓదార్చారు. ఇటీవల అంకాలమ్మగూడూరులో పాము కాటుతో ఇద్దరు పిల్లలు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి శుక్రవారం అంకాలమ్మగూడూరు గ్రామంలోని బాధిత హోంగార్డు రామాంజనేయులు స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చుతూ పాము కాటుకు ఇద్దరు పిల్లలు మృతి చెందడం చాలా బాధాకరమని.. దీంతో కుంగిపోకుండా ధైర్యంగా ఉండాలని.. మా నుంచి ఎప్పుడు సహాయ సహకారాలు ఉంటాయని, అధైర్యపడొద్దని చెప్పారు. ఎంపీ వెంట పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, రమణారెడ్డి, బాబురెడ్డి, సి.కె.బాబు, శ్రీనివాసరెడ్డి, నారపురెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు

రామాపురం : మండలంలోని చిట్లూరు పంచాయతీ కొండవాండ్లపల్లెకు చెందిన మోతాదు మౌనిక తన భర్త వి.ఆర్‌.గణేష్‌, అత్త, మామలు ప్రతి రోజు వేధిస్తున్నారని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మోతాదు మౌనికతో కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరం శ్రీనివాసపురానికి చెందిన ఏ.ఆర్‌.గణేష్‌తో 2021 ఆగస్టు 27న గ్రామ పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. కట్నం కింద 15 తులాలు బంగారు, రూ.2.50 లక్షలు నగదు ఇచ్చారు. తన భర్త బెంగళూరులో వేరే అమ్మాయితో వివాహేతర సంబంధం పెట్టుకొని ప్రతి రోజు శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని తనకు న్యాయం చేయాలని మోతాదు మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఫుడ్‌ టెక్నాలజీతో అపార అవకాశాలు


ఫుడ్‌ సైన్స్‌, టెక్నాలజీ కళాశాల అసోసియేట్‌ డీన్‌ ఎస్‌.సర్దార్‌ బేగ్‌

పులివెందుల టౌన్‌ : ఫుడ్‌ టెక్నాలజీతో అపార అవకాశాలు ఉన్నాయని పులివెందుల ఫుడ్‌ సైన్స్‌అండ్‌ టెక్నాలజీ కళాశాల అసోసియేట్‌ డీన్‌ డాక్టర్‌ ఎస్‌. సర్దార్‌ బేగ్‌ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఫుడ్‌సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ కళాశాలలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫుడ్‌ టెక్నాలజీ కోర్సులో చేరేందుకు అప్లికేషన్స్‌ ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ద్వారా ఈనెల 31వ తేదీ వరకు స్వీకరించడం జరుగుతుందన్నారు. అడ్మిషన్లకు సంబంధించిన అప్లికేషన్‌ను వ్యవసాయ విశ్వ విద్యాలయ వెబ్‌సైట్‌ నుంచి డౌన్‌లోడ్‌ చేసుకుని ఏపీ – ఈఏపీసీ ఈటీలో ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులు తమ కళాశాలకు వెబ్‌ ఆప్షన్‌ ద్వారా ఎంపిక చేసుకోవాలన్నారు. ఈ ఫుడ్‌ టెక్నాలజీ కోర్సు అభ్యసించిన వారికి ఆహార అనుబంధ రంగాలలో అపార అవకాశాలు ఉన్నాయన్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఈకోర్సు అభ్యసించిన విద్యార్థులకు మెండుగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఎక్కువ జీతంతోపాటు సుస్థిరమైన జీవితం లభిస్తుందన్నారు. ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్లలో ప్రొడక్షన్‌, క్వాలిటీ కంట్రోల్‌ ఆఫీసర్లు, ప్రభుత్వ రంగంలో ఫుడ్‌ సేఫ్టీ ఆఫీసర్లు, పేటెంట్‌ ఆఫీసర్లు, ఇతర రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విభాగాలలో అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా సొంతంగా పరిశ్రమలు ప్రారంభించవచ్చునన్నారు. విద్య పూర్తయ్యాక దేశ, విదేశాలలో ఎందరో తమ కళాశాల విద్యార్థులు అధ్యాపకులుగా, ఫుడ్‌ ప్రాసెసింగ్‌ పరిశ్రమలలో వివిధ శాఖలలో స్థిరపడుతున్నారన్నారు. పులివెందుల ఫుడ్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ కళాశాలలో బీటెక్‌ నాలుగేళ్ల డిగ్రీ కోర్సు అందుబాటులో ఉందన్నారు. ఇంటర్‌, టెన్త్‌ ప్లస్‌ టు పూర్తి చేసిన ఎంపీసీ, బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులు ఏపీ ఈఏపీసీ ఈటీలో పొందిన ర్యాంక్‌ ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. ఏపీ– ఈఏపీసీ ఈటీలో ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులు తమ కళాశాలను వెబ్‌ ఆప్షన్‌ ద్వారా ఎంపిక చేసుకోవాలన్నారు. తమ కళాశాలలో పూర్తి స్థాయిలో ఆధునిక ప్రయోగశాలలు ఉన్నాయన్నారు. కళాశాలలో విద్యను పూర్తి చేసిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో విశ్వవిద్యాలయాల్లో ఫెలోషిప్‌లకు ఎంపికయ్యారన్నారు.

టీడీపీ నేత జయసుబ్బారెడ్డిపై కేసు నమోదు

- ఆయనతోపాటు మరో ముగ్గురు కూడా నిందితులు
- మహిళను వేధించి, ఆత్మహత్యకు ప్రేరేపించారని ఆరోపణలు


జయసుబ్బారెడ్డి

కడప అర్బన్‌ : కడప నగరం తాలూకా పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని విజయదుర్గాకాలనీ ఎదురుగా వున్న మల్లికార్జున నగర్‌లో నివాసం వుంటున్న టీడీపీ నేత, కడప మార్కెట్‌ యార్డు మాజీ చైర్మన్‌ జయసుబ్బారెడ్డి, ఆయన అనుచరులైన పీరుబాష, రియాజ్‌ఖాన్‌, పీరులపై శుక్రవారం కేసు నమోదు చేశారు. ఈ కేసు వివరాలిలా వున్నాయి. కడప నగరంలోని హనుమప్ప వీధిలో కోట విజయలక్ష్మి తన తల్లి వద్ద నివాసం వుంటోంది. ఆమె కుమారుడు వెంకట సురేష్‌ ఇండియన్‌ ఎయిర్‌ఫోర్స్‌లో పని చేస్తున్నాడు. వెంకటసురేష్‌ వృత్తిరీత్యా తన భార్య ఇద్దరు కుమారులతో పూణేలో వుంటాడు. వెంకట సురేష్‌ పెద్ద కుమారుడికి చిన్నప్పటి నుంచే తీవ్ర అనారోగ్య సమస్యలున్నాయి. పిల్లవాడికి వైద్యం, ఇతరత్రా కారణాలతో రూ.40 లక్షలు అప్పులు చేశాడు. దీంతో గత ఏడాది మార్చిలో తన తల్లితో తనకు రూ.40 లక్షలు డబ్బులు కావాలని అడిగాడు. ఈక్రమంలో విజయలక్ష్మి విడతల వారీగా దాదాపు 39 లక్షలను తన కుమారుడికి, జయసుబ్బారెడ్డి సిఫారసు మేరకు అనుచరుడు పీరు ద్వారా 'వెస్టర్న్‌ మనీ' ద్వారా వెంకటసురేష్‌ బ్యాంక్‌ ఖాతాకు పంపించారు. అదే స్లిప్‌లను తీసుకుని జయసుబ్బారెడ్డి, తన అనుచరులైన పీరుబాష, రియాజ్‌ఖాన్‌, పీరులు విజయలక్ష్మిని ఈ నెల 21న ఇంటికి వెళ్లి బెదించారు. ఈక్రమంలో జయసుబ్బారెడ్డికి డబ్బులు బాకీ వున్నారని పదేపదే అర్ధరాత్రి సమయంలో పీరుబాష.. విజయలక్ష్మికి ఫోన్‌ చేసి డబ్బులు కట్టాల్సిందేనని బెదిరించారు. దీంతో మరుసటి రోజున విజయలక్ష్మి.. జయసుబ్బారెడ్డి ఇంటికి వెళ్లి తాను డబ్బులు ఎందుకు బాకీ అని ప్రశ్నించింది. దీంతో జయసుబ్బారెడ్డి, 'నీవు చచ్చిపోతే వచ్చిన డబ్బులు' వసూలు చేసుకుంటామని విజయలక్ష్మిని బెదిరించాడు. దీంతో విజయలక్ష్మి తీవ్ర మనస్థాపానికి గురై జయ సుబ్బారెడ్డి ఇంటి మెట్లపై పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. వెంటనే ఆమెను 108లో కడప రిమ్స్‌కు వైద్య సేవల కోసం తీసుకుని వెళ్లారు. బాధితురాలి అన్న శ్రీనివాసులరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పై నలుగురిపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై కడప తాలూకా సీఐ ఉలసయ్య మాట్లాడుతూ బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేశామన్నారు. చట్ట పరిధిలో నిందితులకు పోలీసులు శుక్రవారం 41 నోటీసులు జారీ చేశారు.

ఇద్దరు బైక్‌ దొంగల అరెస్ట్‌

ప్రొద్దుటూరు క్రైం : పలు ప్రాంతాల్లో బైక్‌ చోరీలకు పాల్పడిన ఇద్దరిని టూ టౌన్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఈ వివరాలను సీఐ ఇబ్రహీం శుక్రవారం సాయంత్రం మీడియాకు తెలిపారు. నిందితులు మోడంపల్లె బైపాస్‌ రోడ్డులో ఉన్నారని సమాచారం రావడంతో సీఐ ఇబ్రహీం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ప్రొద్దుటూరులోని వివేకానంద కాలనీకి చెందిన గండి వీరాంజనేయులు, చాపాడు మండలంలోని బసిరెడ్డిపల్లెకు చెందిన రమణబోయిన శ్రీనివాసులును అరెస్ట్‌ చేశారు. వారి వద్ద నుంచి ఆరు మోటార్‌ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించనున్నట్లు సీఐ తెలిపారు.

ప్రజల్లో ధార్మిక చింతన పెరగాలి


ప్రమాణ స్వీకారం చేస్తున్న ధర్మ ప్రచార మండలి సభ్యులు

కడప కల్చరల్‌ : ప్రజల్లో ధార్మిక చింతన పెరగాలని బ్రహ్మంగారిమఠంలోని అచలానందస్వామి ఆశ్రమ పీఠాధిపతి విరజానంద సరస్వతి స్వామి, జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠం మఠాధిపతి శ్రీ వీరశివకుమార స్వామి అన్నారు. తిరుమల–తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో అనుబంధ సంస్థ జిల్లా హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ శుక్రవారం స్థానిక ఇందిరానగర్‌లోని శ్రీ భద్రాద్రి రామయ్య ఆలయంలో విద్యార్థులకు ధార్మిక కథల పోటీలు నిర్వహించారు. బహుమతి ప్రధాన సభకు ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ బీటలు వారిన హిందూ ధర్మాన్ని కాపాడే బాధ్యత హిందువులందరూ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాటి మానవుల పట్ల ప్రేమ చూపుతూ మన మతానికి దూరమైన వారిని కూడా మన వాళ్లుగా భావించి ఆదరించాలన్నారు. ధార్మిక చింతన ద్వారానే బాలల్లో నైతిక విలువలు అలవడతాయని, హిందూ ధర్మ గ్రంథాలను చదవాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో 9–15 ఏళ్ల వయస్సు వారితో రెండు విభాగాలుగా పోటీలు నిర్వహించారు. రామాయణ, భారత, భాగవతంతోపాటు ఇతర ధార్మిక గ్రంథాలు, పంచతంత్ర గ్రంథాల నుంచి నీతి కథలను, ధర్మాన్ని తెలిపే కథల పోటీ నిర్వహించారు. దాదాపు 60 మందికి పైగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో సీనియర్స్‌లో జి.దీప్తిలోచన, ఇ.లక్ష్మి విఘ్నేష్‌, జూనియర్స్‌లో జె.మనస్వి, ఎ.శ్రీదివ్య, జె.పొన్నిశ్రీలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. విజేతలైన బాలలకు రూ.1000, రూ.750, రూ.500 నగదు బహుమతులు అందజేశారు. మహేశ్వరమ్మ, కృష్ణమోహన్‌, ఏఎన్‌ఆర్‌ సత్యశ్రీ, చింతకుంట శివారెడ్డి, దామోదరమ్మ, ఈశ్వర్‌రెడ్డిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ధర్మ ప్రచార పరిషత్‌ ప్రోగ్రామ్‌ అసిస్టెంట్‌ గోపిబాబు, ధార్మికవేత్త బెస్తవేముల రామమహేష్‌ల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ధార్మికవేత్తలు, వివిధ ఆలయాల ధర్మకర్తలు, పాలక మండలి సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం
తిరుమల–తిరుపతి దేవస్థానాల అనుబంధ సంస్థ హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ ఆధ్వర్యంలో ధర్మ ప్రచార మండలిని ఏర్పాటు చేశారు. ధర్మ ప్రచార పరిషత్‌ జిల్లా ప్రోగ్రామ్‌ అసిస్టెంట్‌ గోపిబాబు, ధార్మికవేత్త బెస్తవేముల రామమహేష్‌ల పర్యవేక్షణలో 17 మంది కార్యవర్గ సభ్యులను ఎంపిక చేసుకున్నారు. కడప ఇందిరానగర్‌లోని శ్రీ భద్రాద్రి కోదండరామ స్వామి ఆలయ ప్రాంగణంలో అచలానంద ఆశ్రమ పీఠాధిపతి స్వామి విరజానంద సరస్వతి, ఈశ్వరీదేవి మఠం పీఠాధిపతి వీర శివకుమారస్వామిలు నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

నవోదయలో ముగిసిన క్రీడా పోటీలు

రాజంపేట : మండల పరిధిలోని నారనరాజుపల్లిలో ఉన్న జవహర్‌ నవోదయ విద్యాలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌ గీతా వివరాలు వెల్లడించారు. ఈ నెల 27, 28వ తేదీల్లో వాలీబాల్‌, బాస్కెట్‌ బాల్‌, ఫుట్‌బాల్‌, హ్యాండ్‌ బాల్‌ పోటీలు జరిగాయి. ఇందులో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, పుదుచ్చేరి నుంచి మొత్తం 416 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ క్రీడలను నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం పది మంది వ్యాయామ ఉపాధ్యాయులను నియమించింది. గత రెండు రోజులుగా జరిగిన ఈ క్రీడల్లో అత్యధికంగా అన్నమయ్య, కడప జిల్లా నుంచి 46, ప్రకాశం జిల్లా నుంచి 45, నెల్లూరు జిల్లా నుంచి 37, కర్నూలు జిల్లా నుంచి 25, పుదుచ్చేరి జిల్లా నుంచి 23, అనంతపురం జిల్లా నుంచి 19, చిత్తూరు జిల్లా నుంచి 9 మంది క్రీడాకారులు దక్షణ భారత దేశ స్థాయిలో జరగబోయే పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్‌లో ఎంపికైన క్రీడాకారులు కర్ణాటకలోని హావేరిలో, హ్యాండ్‌ బాల్‌లో ఎంపికైన క్రీడాకారులు ఆంధ్ర ప్రదేశ్‌లోని విజయనగరం, బాస్కెట్‌ బాల్‌లో ఎంపికైన క్రీడాకారులు కేరళలోని కాసర్‌ గడ్‌, ఫుట్‌బాల్‌లో ఎంపికైన క్రీడాకారులు కేరళలోని త్రిశూర్‌లో జరగబోయే క్రీడా పోటీలలో పాల్గొంటారు. ఇందులో భాగంగా సుబ్రతో కప్‌ పేరుతో ఫుట్‌బాల్‌ టోర్నీ జరిగింది. అందులో అండర్‌ 14 బాలుర విభాగంలో ప్రకాశం, అన్నమయ్య, అండర్‌ 17 బాలుర విభాగంలో నెల్లూరు, ప్రకాశం, బాలికల విభాగంలో అన్నమయ్య, నెల్లూరు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ క్రీడా పోటీలను విద్యాలయ ఉప ప్రాచార్యులు డి.శ్రీనివాసరావు, మార్గదర్శకత్వంలో స్థానిక విద్యాలయ వ్యాయామ ఉపాధ్యాయులు, అన్నాదురై యాస్మిన్‌ నిర్వహించారు.